

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.142	206	234
సూర్యాపేట	రూ.155	230	260
నల్లగొండ	రూ.149	216	246

ఉష్ణోగ్రత గరిష్ఠం 39.5 । కనిష్ఠం 24.4



ఆ మెజార్టీ వచ్చేనా?

గతమెంతో ఘనం


నల్లగొండ, మే 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ముక్కోణ పోటీ నెలకొన్న లోక్‌సభ ఎన్నిక లు ఆసక్తిరేపుతున్నాయి. నల్లగొండ లోక్‌సభ నుంచి తొలి ఎన్నికల్లో గెలుపొందిన కమ్యూనిస్టునేత రావినారాయణరెడ్డి సాధించిన ట్లే, ఈ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డికి జాతీయస్థాయిలో అత్యధిక మెజార్టీ సాధిస్తామని మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నేతలు ప్రచారం చేస్తున్నారు. బలమైన పోటీలో తమ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిదే గెలుపని బీఆర్ఎస్ మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యేలు సవాల్ విసురుతున్నారు. మరోవైపు మోదీ మేనియాతో ఇక్కడ జెండా పాతుతామని బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఓటర్ల తీర్పుపైనే అభ్యర్థుల భవితవ్యం ఆధారపడి ఉంది. ఈ సారి దేశవ్యాప్తంగా సైతం గట్టిపోటీ సాగుతున్న నేపథ్యంలో ఈ ఆల్‌టైమ్ రికార్డులు బ్రేక్ అవుతాయా? లేక తగ్గుతాయా? అనే అంశం జూన్ 4వ తేదీన వెలువడే ఫలితంతో తేలనుంది.

ప్రీతమ్‌ముండే ఆల్‌టైమ్ రికార్డు



దేశవ్యాప్త అత్యధిక మెజార్టీని పరిశీలిస్తే 2014 లోక్‌సభ ఎన్నిక ల్లో మహారాష్ట్రలోని బీడ్ నియోజక వర్గం నుంచి గెలుపొందిన డాక్టర్ ప్రీతమ్ గోపీనాథ్‌ముండేకు అత్యధికంగా 6,96,321 ఓట్ల మెజార్టీ దక్కింది. దేశవ్యాప్తంగా ఆమెది ఆల్‌టైమ్ రికార్డు మెజార్టీ. కేంద్రంలో మంత్రిగా, మహారాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రిగా పనిచేసిన, లోకనేతగా ప్రసిద్ధి చెందిన గోపీనాథ్‌ముండే కుమార్తె ప్రీతమ్ ముండే. ఆమె తొలిసారి 2014 ఎన్నికల్లో బీడ్ నియోజకవర్గం నుంచి పోటీచేయగా, ఆ ఎన్నికల్లో ఆమెకు దేశవ్యాప్తంగా ఆల్‌టైమ్ రికార్డు మెజార్టీ దక్కింది. గత ఎన్నికల్లో గుజరాత్‌లోని నవసారి లోక్‌సభ నియోజకవర్గం నుంచి గెలుపొందిన బీజేపీ అభ్యర్థి సీఆర్ పాటిల్ అత్యధికంగా 6.89లక్షల మెజార్టీతో గెలుపొందారు.

తొలి ఎన్నికల్లో రావి రికార్డు



మొదటి నుంచి చారిత్రక ప్రాధాన్యం కలిగిన నల్లగొండ లోక్‌సభ స్థానంలో 1952లో జరిగిన మొదటి లోక్‌సభ ఎన్నికల్లో అప్పటి పీడీఎఫ్ అభ్యర్థి, కమ్యూనిస్టునేత రావి నారాయణరెడ్డి దేశవ్యాప్తంగా అత్యధిక మెజార్టీ సాధించారు. ఆ ఎన్నికల్లో ఆయనకు 3,09,162 ఓట్లు రాగా, 2,22,280 ఓట్ల మెజార్టీ వచ్చింది. అప్పట్లో ఇది దేశవ్యాప్త రికార్డు మెజార్టీ. ఆ గౌరవంతోనే ఆయనతో పార్లమెంట్ భవనాన్ని ప్రారంభింపచేయించారు. అంతటి ప్రాధాన్యం కలిగిన లోక్‌సభ నియోజకవర్గ స్థానంలో మళ్లీ 72 ఏళ్ల తర్వాత ఆ స్థాయి రికార్డు సాధించాలని ప్రస్తుత కాంగ్రెస్ నేతలు సంకల్పించారు.

ఉమ్మడి రాష్ట్రంలో పీవీకి, కేసీఆర్‌కు రికార్డు మెజార్టీ



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అత్యధిక మెజార్టీలను పరిశీలిస్తే 1991 లోక్‌సభ ఉప ఎన్నికల్లో అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు 5,80,297 ఓట్ల అత్యధిక మెజార్టీతో గెలుపొందారు. ఆంధ్రప్రదేశ్ నుంచి మొదటిసారి తెలుగు బిడ్డ ప్రధానమంత్రి పదవిని అధిరోహించిన నేపథ్యంలో ఆయన గౌరవార్థం అప్పటి ప్రతిపక్ష పార్టీ తెలుగుదేశం అభ్యర్థిని పోటీలో నిలపలేదు. అయితే బీజేపీ నుంచి బంగారు లక్ష్మణ్ పోటీ చేయగా, ఆయనకు కేవలం 45,944 ఓట్లు మాత్రమే వచ్చాయి. జిల్లాకు చెందిన మోత్కుపల్లి నరసింహులు స్వతంత్ర అభ్యర్థిగా ఆ ఎన్నికల్లో పోటీచేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం 2014 ఎన్నికల్లో మెదక్ నుంచి గెలుపొందిన మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుదే ఆల్‌టైమ్ రికార్డు. ఆయనకు ఆ ఎన్నికలో 3,97,029 ఓట్ల భారీ మెజార్టీ దక్కింది. స్వతంత్ర భారత దేశంలో తెలంగాణ నుంచి ఆల్‌టైమ్ రికార్డు మెజార్టీ కూడా ఇదే. అదే ఎన్నికల్లో వరంగల్ నుంచి గెలుపొందిన కడియం శ్రీహరి (బీఆర్ఎస్) 3,92,574 ఓట్ల మెజార్టీతో రెండో స్థానంలో నిలిచారు. 2019 ఎన్నికల్లో వరంగల్ నుంచి గెలుపొందిన పసునూరి దయాకర్ 3,50,298 ఓట్ల మెజార్టీ దక్కింది.

ఆమెకేదీ అందలం

- పార్లమెంట్‌లో కాలుమోపని మహిళ
- ఓట్లలో అధికమైనా.... అవకాశమివ్వని పార్టీలు
- భువనగిరి పార్లమెంట్ నుంచి మొండిచేయి!



భువనగిరి టౌన్, మే7: ఓట్లలోనూ ఆమెదే పైచేయి. ఆమెను అందలం ఎక్కిస్తామని అన్ని పార్టీలు ఉపన్యాసాలతో ఊదరగొడతాయి. కానీ వాస్తవంలో మాత్రం ఇందుకు భిన్నమైన పరిస్థితి. 18వ పార్లమెంట్ సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్నప్పటికీ ఇప్పటివరకు ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని భువనగిరి, నల్లగొండ నియోజకవర్గాలనుంచి ఏ ఒక్క మగువ నేటివరకూ పార్లమెంట్‌లో ప్రజాప్రతినిధిగా కాలు మోపలేదు. ప్రధాన రాజకీయ పార్టీలేవి మహిళలను ఇప్పటివరకు పార్లమెంట్ ఎన్నికల బరిలో నిలపకపోవడమే అసలైన కారణం. సుమారు పదేళ్లపాటు సోనియాగాంధీ జాతీయ అధ్యక్షురాలిగా కొనసాగి, నేటికీ ఆమెనే ఆ పార్టీ అగ్రనేతగా కొనసాగుతున్న కాంగ్రెస్ పార్టీ, చట్ట సభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నామంటున్న బీజేపీ, మహిళాభ్యుదయానికి తామే అగ్ర ప్రాధాన్యం ఇస్తున్నామంటున్న బీఆర్ఎస్ మహిళలను ఓటు బ్యాంకుగానే పరిగణిస్తున్నాయి మినహా చైతన్యానికి, కార్యదక్షతకు ప్రతీకలైన మగువలను పార్లమెంటుకు పంపే చిత్తశుద్ధిని చూపలేదని మహిళాభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే సీపీఎం మాత్రం 2019 ఎన్నికల్లో నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి మల్లులక్ష్మిని నిలిపి కాస్త చిత్తశుద్ధిని ప్రదర్శించింది.

ఆమెదే పైచేయి

ప్రస్తుత 2024 ఎన్నికల్లో రెండు నియోజకవర్గాల్లోనూ మహిళా ఓటర్లే అధికంగా ఉండటం విశేషం. రెండు నియోజక వర్గాలలో కలిపి పురుషులకంటే మహిళా ఓటర్లు 44,162మంది అధికంగా ఉన్నారు. భువనగిరితో పోలిస్తే నల్లగొండలోనే మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. దీంతో ప్రచారానికి వచ్చే నాయకులను నిలదీయాలని, భవిష్యత్‌లో చట్ట సభకు తమను పంపుతారని విశ్వాసం ఉన్న పార్టీలకే ఓటేయాలని సామాజిక కార్యకర్తలు సూచిస్తున్నారు.

ఓట్లు ఇలా..

నియోజకవర్గం	మహిళలు	పురుషులు	ఇతరులు
భువనగిరి	9,04,247	8,94,376	78
నల్లగొండ	8,76,538	8,42,247	169
మొత్తం	17,77,785	17,36,623	247

ప్రచారానికి మాత్రమే పరిమితం

అన్ని రంగాలతోపాటు రాజకీయ రంగంలోనూ మహిళలకు ప్రాధాన్యం ఇస్తున్నామంటున్న నేతల మాటలు ఊరడింపునకే పరిమితమవుతున్నాయనేది జగమెరిగిన సత్యం. రిజర్వేషన్ కారణంగా స్థానిక సంస్థల్లో మహిళలకు 50 శాతం పదవులు దక్కుతున్నప్పటికీ విధుల్లో మాత్రం కుటుంబ సభ్యులదే ఆధిపత్యంగా ఉంటుంది. కనీసం పార్టీ పదవులలోనూ తమకు ప్రాధాన్యం గుర్తింపు, గౌరవం లభించడంలేదని అన్ని పార్టీల మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు వాపోతుండటం సర్వసాధారణమే. కానీ పార్టీ, ఎన్నికల సభలకు, కార్యక్రమాలకు మాత్రం అధికసంఖ్యలో తరలి రావాలని ఆదేశిస్తున్న తీరు సమంజసంగా ఉండటంలేదని స్వయంగా ఆ పార్టీల మహిళా నాయకులే పార్టీ వేదికలపై పలుమార్లు లేవనెత్తిన సందర్భాలు అనేకం ఉన్నాయి. దీంతో సభలకు, ర్యాలీలకు ప్రత్యేక ఆకర్షణ చేకూరేందుకే కేవలం తాత్కాలిక ప్రాధాన్యం, గుర్తింపు ఇస్తున్నారని మహిళా నాయకురాళ్లు వాపోతున్నారు. ఇప్పటికైనా మహిళల నాయకత్వ పటిమపై ఉన్న చిన్న చూపును వీడాలని కోరుతున్నారు.

కేంద్రంలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే

సీఎల్పీ మాజీ నేత జానారెడ్డి



నిడమనూరులో జరిగిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న జానారెడ్డి, చిత్రంలో ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి

నిడమనూరు, మే 7: కేంద్రంలో రానున్నది రాహుల్‌గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వమేనని సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి అన్నారు. మంగళవారం నిడమనూరులో నల్లగొండ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్‌రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. కాంగ్రెస్ హయాంలోనే నియోజకవర్గంతో పాటు రాష్ట్రం అభివృద్ధి చెందిందని అన్నారు. మాయమాటలతో పదేళ్లు పాలించిన కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చాడని ఆరోపించారు. మతం పేరుతో బీజేపీ రాజకీయం చేస్తూ దేశానికి ప్రమాదకారిగా మారిందని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పిన మాదిరిగానే పార్లమెంటు ఎన్నికల్లో కూడా బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను అమలు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రఘువీర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం 92శాతం మంది రైతులకు రైతుబంధు సొమ్ము జమ చేసిందన్నారు. ఎన్నికల్లో తనను ఆశీర్వదిస్తే ఈ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి మాట్లాడుతూ, ఈ ఎన్నికల్లో సాగర్ నియోజకవర్గం నుంచి రఘువీర్‌రెడ్డికి లక్ష ఓట్ల మెజార్టీ ఇవ్వాలని కోరారు. ముకుందాపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు వంగాల వెంకన్న, రాంసైదయ్య తదితరులు గండికోట యాదగిరి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, పీసీసీ ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య, రంగశాయిరెడ్డి, మేరెడ్డి వెంకట్‌రాహుల్, నందికొండ మట్టారెడ్డి, మేరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, అంకతి సత్యం, పసుపులేటి సైదయ్య, అంకతి వెంకటరమణ, కొండా శ్రీనివాస్‌రెడ్డి, గండికోట యాదగిరి, చినవీరయ్య, బొల్లం శ్రీను, నూకల వెంకట్‌రెడ్డి, వల్లభ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అత్యధిక మెజార్టీతో చరిత్రను తిరగరాయాలి

త్రిపురారం: నల్లగొండ కాంగ్రెస్ ఎంపీని అత్యధిక మెజార్టీతో గెలిపించి దేశ పార్లమెంట్ చరిత్రను తిరగరాయాలని అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి పిలుపునిచ్చారు. త్రిపురారం మండల కేంద్రంలో మంగళవారం రాత్రి నిర్వహించిన రోడ్‌షోలో వారు మాట్లాడారు. జిల్లాలో కాంగ్రెస్ హయంలోనే అభివృద్ధి జరిగిందన్నారు. ఎత్తిపోతల పథకాలకు త్వరలో పూర్తిస్థాయి మరమ్మతులు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి మాట్లాడుతూ, ఓటర్లు హస్తం గుర్తుకు ఓటేయాలని పిలుపునిచ్చారు. మార్కెట్ ఛైర్మన్ చంద్రారెడ్డి బీఆర్ఎస్‌ను వీడి రఘువీర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. తొలుత మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ అనుముల పాండమ్మ, జడ్పీటీసీ భారతి, పార్టీ మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, నాయకులు అనుముల శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌నాయక్, నరేష్, అనుముల వెంకట్‌రెడ్డి, గట్టు యాదగిరి, గోపగాని శ్రీనివాస్, పీబీ.శ్రీనివాస్, సాంబయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ది ప్రజాప్రభుత్వం

ప్రతీ గ్యారెంటీ అమలు ● ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



చౌటుప్పల్‌లో సమావేశంలో మాట్లాడుతున్న భట్టివిక్రమార్క, పక్కన ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

మునుగోడు, చౌటుప్పల్, మే 7: కాంగ్రెస్‌ది ప్రజాప్రభుత్వమని, గత ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ గ్యారెంటీ అమలు చేసి ప్రజలు మెచ్చిన పాలన సాగిస్తోందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. మునుగోడు, చౌటుప్పల్‌లో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో మంగళవారం జరిగిన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తలు, విలేకరుల సమావేశాల్లో ఆయన మాట్లాడారు. రైతులు ఎలాంటి అపవాదులను నమ్మవద్దని, రైతుబంధు డబ్బును రైతు భరోసా పథకం పేరుతో విడతల వారీగా అందజేస్తామన్నారు. రైతులకు వ్యతిరేకంగా బీజేపీ నిలబడిందని, రాష్ట్ర ప్రజలను బీఆర్ఎస్ మోసం చేసిందని, ఈ రెండు పార్టీలకు ఓట్లు వేసిన వృథా అవుతాయని అన్నారు. ఈ పార్టీలను పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పున్న కైలాష్‌నేత, అధికార ప్రతినిధి బండ్ల గణేష్, డీసీసీబీ డైరెక్టర్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు నారబోయిన రవిముదిరాజ్, జక్కలి ఐలయ్యయాదవ్, వేమిరెడ్డి జితేందర్‌రెడ్డి, ఎంపీపీ కర్నాటి స్వామియాదవ్, గుత్తా ఉమాదేవి, మర్రిగూడ, నాంపల్లి జడ్పీటీసీలు పాశం సురేందర్‌రెడ్డి, ఏవీ.రెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాల్వాయి చెన్నారెడ్డి, చౌటుప్పల్ మునిసిపల్ ఛైర్మన్ వెన్‌రెడ్డి రాజు, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ బస్సు యాత్రతో
కాంగ్రెస్, బీజేపీలో వణుకు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి, చిత్రంలో అభ్యర్థి రాకేష్‌రెడ్డి, తదితరులు

నల్లగొండ, మే 7: మిర్యాలగూడ నుంచి కేసీఆర్ బస్సు యాత్ర ప్రారంభించగానే ప్రజల నుంచి వస్తున్న స్పందన చూసి కాంగ్రెస్, బీజేపీలో వణుకు మొదలైందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్‌రెడ్డి నామినేషన్ సందర్భంగా నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ పని అయిపోందని అనుకున్న వాళ్లందరికీ ప్రజలు బ్రహ్మరథం పడుతుండటంతో, కాం గ్రెస్, బీజేపీలో భయం ఏర్పడిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత జరుగుతున్న పరిణామాలే కేసీఆర్‌కు ఎందుకు ఓటు వేయాలో స్పష్టం చేస్తున్నాయన్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు కేఆర్ఎంబీ చేతులోకి పోవడానికి కాంగ్రెస్ కారణమని ఆరోపించారు. కృష్ణా జలాల్లో హక్కుల కోసం నల్లగొండలో కేసీఆర్ లక్ష మందితో సమావేశం పెట్టడం వల్లే కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయక తప్పలేదన్నారు. గోదావరి జలాలు తీసుకెళ్లి కావేరిలో కలిపే కుట్రలను మోదీ ప్రభుత్వం చేస్తోందన్నారు. కాంగ్రెస్, బీజేపీ పక్క రాష్ట్రాల ప్రయోజనాలకే పెద్దపీట వేస్తున్నాయని, తెలంగాణ ప్రయోజనాలు ఆ పార్టీకి పట్టవన్నారు. కేసీఆర్‌కు వ్యతిరేకంగా మోదీ, రేవంత్‌రెడ్డి ఒక్కటిగా ఉన్నారని, అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్‌రెడ్డిని గెలిపించేందుకు మోదీ సహకరించగా, ఎంపీ ఎన్నికల్లో మోదీని గెలిపించేందుకు రేవంత్‌రెడ్డి కంకణం కట్టుకున్నారన్నారు. బీఆర్ఎస్ గెలుపును అడ్డుకోవడానికి ఆ రెండు పార్టీలో ఒక్కటయ్యాయన్నారు. మండలి ఎన్నికల్లో రాకేష్‌రెడ్డిని గెలిపిస్తే ప్రశ్నించే గొంతుగా నిలుస్తాడని, నిరుద్యోగుల ప్రక్షాన పోరాడే శక్తిగా ఉంటాడన్నారు. సమావేశంలో మాజీ ఎంపీ బి.లింగయ్యయాదవ్, మాజీ మంత్రి సత్యవతిరాథోడ్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు కోటిరెడ్డి, తాత మధు, డీసీసీబీ ఛైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, కంచర్ల భూపాల్‌రెడ్డి, నల్లమోతు భాస్కర్‌రావు, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, గాదరి కిషోర్, బొల్లం మల్లయ్య యాదవ్, చిరుమర్తి లింగయ్య, పైళ్ల శేఖర్‌రెడ్డి, తిప్పన విజయసింహారెడ్డితో పాటు నాయకులు పాల్వాయి స్రవంతి, చెరుకు సుధాకర్, రామచందర్‌నాయక్, మందడి సైదిరెడ్డి, రెగెట్టె మల్లికార్జున్ రెడ్డి, బోనగిరి దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

'పట్టభద్రుల' స్థానానికి 14నామినేషన్లు దాఖలు

నల్లగొండ, మే 7: వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి మంగళవారం 14 నామినేషన్లు దాఖలయ్యాయి. బీఆర్ఎస్ అభ్యర్థిగా ఏనుగుల రాకేష్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. శ్రమజీవి పార్టీ తరఫున జాజుల బాస్కర్, అలయన్స్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ అభ్యర్థిగా ఈద శేషగిరిరావు, స్వతంత్ర అభ్యర్థులుగా ఐతగోని రాఘవేంద్ర, పైడిశెట్టి రాజు, పూజారి సత్యనారాయణ నామినేషన్లు దాఖలు చేశారు. యువతరం పార్టీ అభ్యర్థిగా బండారు నాగరాజు, స్వతంత్ర అభ్యర్థులుగా మారం వెంకట్‌రెడ్డి, గుగులోతు బీమా, పెంచల శ్రీనివాస్, కంటె సాయన్న, దైద సోమ సుందరం నామినేషన్ వేశారు. తెలంగాణ సకల జనుల సమ్మె పార్టీ అభ్యర్థిగా నందిపాటి జానయ్య, స్వతంత్ర అభ్యర్థిగా అల్వాల కనకరాజు నామినేషన్లు వేశారు.

వడగళ్ల వాన



నల్లగొండలో కురుస్తున్న వర్షం

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పలు మండలాల్లో మంగళవారం ఈదురుగాలుతో కూడిన వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ ఉన్నప్పటికీ సాయంత్రం ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై, ఉరుములు, మెరుపులతో భారీ వర్షం పడింది. నల్లగొండ జిల్లా కనగల్ మండలంలో గంటన్నర వ్యవధిలో 6.7సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. పలు మండలాల్లో గాలి దుమారానికి మామిడి చెట్ల కాయలు రాలాయి. విద్యుత్ స్తంభాలు నేలకూలడంతో సరఫరాకు అంతరాయం ఏర్పడి పలు గ్రామాల్లో అంధకారంలో మగ్గాయి.

•7లో..

ప్రజ్వల్ రేవణ్ణను అరెస్ట్ చేయాలి

మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు మాధవి



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకులు

నల్లగొండ, మే 7: లైంగిక వేధింపుల కేసులో కర్నాటక జేడీఎస్ నాయకుడు, ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణను తక్షణమే అరెస్ట్ చేయాలని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు గోపగాని మాధవి డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మంత్రి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయం నుంచి ఎన్టీఆర్ విగ్రహం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, లైంగిక వేధింపుల కేసులో ఉన్న రేవణ్ణకు ఎన్‌డీఏ కూటమీ ఎంపీ టికెట్ ఇవ్వడం సిగ్గు చేటని విమర్శించారు. మహిళలపై లైంగిక దాడులకు పాల్పడిన ప్రజ్వల్ రేవణ్ణపై చర్యలు తీసుకోకుండా, దేశం దాటించారని ఆరోపించారు. మోదీ ప్రభుత్వం బ్యాంకులను దోచుకున్న నీరవ్‌మోదీతో పాటు మహిళలపై అత్యాచారం చేస్తున్న వారిని కాపాడుతోందన్నారు. కేంద్రంలో మతతత్వ బీజేపీ పార్టీని తక్షణమే గద్దె దించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నాంపల్లి భాగ్య, నూరెడ్డి సరస్వతి, సుజాత, దుబ్బ రూప, నాగమణి, నాగరాణి, జాను, లలిత, జానకీ, కీర్తి, సువర్ణ, పుష్పలత, రుక్మిణి, మహంకాళి, సదాలక్ష్మి, నిర్మలదేవి, జూబేర, రజిత, పద్మ, స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు కార్డు తప్పనిసరి : కలెక్టర్

నల్లగొండ టౌన్, మే 7: పార్లమెంటు ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రంలో ఓటర్లు తప్పనిసరిగా గుర్తింపు కార్డు చూపాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దాసరి హరిచందన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం అనుమతించిన 12 గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకదాన్ని చూపించి ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఆధార్ కార్డు, ఉపాధి హామీ జాబ్ కార్డ్, బ్యాంక్, పోస్టాఫీస్‌లు ఫొటో సహా జారీ చేసిన పాస్‌బుక్, కేంద్ర కార్మిక శాఖ ద్వారా జారీ చేసిన ఆరోగ్య బీమా స్మార్ట్ కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డ్, ఆర్జీఐఎస్‌పీఆర్ కింద జారీ చేసిన స్మార్ట్‌కార్డ్, పాస్‌పోర్ట్, ఫొటో ఉన్న పెన్షన్ డాక్యుమెంట్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పబ్లిక్ సెక్టర్ అండ్ టేకింగ్ సంస్థలు, పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు ఉద్యోగులకు జారీచేసిన ఫొటో గుర్తింపు కార్డ్, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు జారీచేసిన అధికారిక గుర్తింపు కార్డ్, కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వశాఖ జారీచేసిన యునిక్ దివ్యాంగ కార్డుల్లో ఏదో ఒకటి చూపించి ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు

ఎన్నికల భత్యం సమానంగా ఇవ్వాలి

రుప్ జిల్లా అధ్యక్షుడు యూసుపుద్దీన్

నల్లగొండ, మే 7: ఎన్నికల విధులు నిర్వహించే పీవో, ఏపీవో, వోపీవోలకు ఇతర జిల్లాలతో సమానంగా భత్యం చెల్లించాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ జిల్లా అధ్యక్షుడు ఎండి.యూసుపుద్దీన్ డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు కలెక్టర్ దాసరి హరిచందనకు వినతి పత్రం అందజేశారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇతర జిల్లాల్లో ఇచ్చిన భత్యంతో పోలిస్తే జిల్లాలో తక్కువగా ఇచ్చారని ఈ సందర్భగా కలెక్టర్ దృష్టికి తెచ్చారు. అదేవిధంగా వేసవి దృష్ట్యా ప్రతీ పోలింగ్ కేంద్రంలో సిబ్బందికి ఇబ్బందులు కలగకుండా తాగునీటితోపాటు కూలర్లు ఏర్పాటు చేయాలని కోరారు.

పోస్టల్ బ్యాలెట్ గడువు పొడిగించాలి

మిర్యాలగూడ టౌన్, మే 7: పోస్టల్ బ్యాలెట్ ఓటు నమోదు గడువును పొడిగించాలని బంజారా ఉద్యోగుల సంఘ రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరథనాయక్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదలచేశారు. ఈ నెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ఓటేసేందుకు ఈ నెల 8 వరకు గడువిచ్చారన్నారు. అయితే ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు దూర ప్రాంతాల్లో ఉన్నారని, వారిలో సగం మంది కూడా ఇప్పటికీ ఓటు వేయలేకపోయారన్నారు. మరో వైపు అదే తేదీన శిక్షణ ఉందని, ఉద్యోగులంతా శిక్షణ తరగతుల్లో ఉండి ఓటేయలేక పోతారని అన్నారు. గతంలో పోలింగ్ తేదీకి ముందురోజు వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటేసే అవకాశం ఉండేదని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదన్నారు. దీన్ని పరిశీలించి ఈ నెల 10వ తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటేసే అవకాశం కల్పించాలని కోరారు.

క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు

● యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు ● ఆలయ నిత్య ఆదాయం రూ.19,69,279

యాదగిరిగుట్ట రూరల్, మే 7: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి కొండపైన కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి మంగళవారం నాగవల్లి దళార్చనలు, నృసింహుడికి నిత్య పూజలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. కొండపైన విష్ణుపుష్కరిణి వద్ద ఆంజనేయ స్వామిని వేదమంత్రాలతో పంచామృతాభిషేకం చేసిన అర్చకులు సింధూరం, వివిధ రకాల పూలతో అలంకరించారు. ఆంజనేయుడికి సహస్రనామ పఠనాలతో నాగవల్లీ దళార్చన చేపట్టారు. ప్రధానాలయం లోని స్వయంభువులను సుప్రభాత సేవతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు, ముఖమండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్య కల్యాణపర్వాలను పాంచరాత్రాగమ శాస్త్రరీతిలో నిర్వహించారు. కొండ పైన అనుబంధ శివాలయంలో పర్వతవర్థిని సమేత రామలింగేశ్వరస్వామికి, ముఖ మండపంలోని స్ఫటికమూర్తులకు నిత్యపూజలు, నిత్య రుద్రహవనం, సీతారామచంద్రస్వామి వసంతోత్సవాలు శైవగమ పద్ధతి లో కొనసాగాయి. అనుబంధ పాతగుట్ట ఆలయం విష్ణుపుష్కరిణి కొండ పైన శివాలయంలోని ఆంజనేయస్వామిని ఆరాధిస్తూ అర్చకులు ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.19,69,279 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏ.భాస్కర్‌రావు తెలిపారు.



లక్ష్మీనృసింహుల నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కృష్ణాజలాల సరఫరాకు
విద్యుత్ సమస్య లేకుండా చూడాలి

● పంప్‌హౌస్ నిర్వహణకు రూ.7కోట్లతో ప్రతిపాదనలు ● ట్రాన్స్‌కో రూరల్ జోన్ చీఫ్ ఇంజనీర్



కోదండపురం పంప్‌హౌస్‌ను పరిశీలిస్తున్న టీఎస్ ట్రాన్స్‌కో రూరల్ జోన్ చీఫ్ ఇంజనీర్ లతావినోద్

పెద్దఅడిశర్లపల్లి, మే 7: హైదరాబాద్ జంటనగరాలకు కృష్ణా జలాల సరఫరాలో విద్యుత్, సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ట్రాన్స్‌కో రూరల్ జోన్ చీఫ్ ఇంజనీర్ లతావినోద్ అధికారులకు సూచించారు. మంగళవారం హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ, ట్రాన్స్‌కో అధికారులతో కలిసి హైదరాబాద్ జంటనగరాలకు కృష్ణాజలాలను సరఫరా చేసే గొడుగోండ్ల, నసర్లపల్లి, కోదండపురం వాటర్ ప్లాంట్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయా ప్లాంట్ల వద్ద అవసరమైన విద్యుత్ పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అదనంగా విద్యుత్ సర్క్యూట్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇక్కడి మూడు పంప్‌హౌస్ నిర్వహణకు రూ.7కోట్ల నిధులకు ప్రతిపాదనలు పంపినట్టు తెలిపారు. అనంతరం పెద్దవూర మండలం సుంకిశాల వద్ద జరుగుతున్న విద్యుత్ పనులను ఆమె పరిశీలించారు. పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట డీఈఈ వెంకటేశ్వర్లు, శ్రీనాథ్‌కుమార్, విద్యాసాగర్, ఏడీఈ ప్రదీప్ ఉన్నారు.

67ఏళ్లలో ఉమ్మడి జిల్లా నుంచి ఒక్కరికే అమాత్యయోగం



భువనగిరి టౌన్, మే 7: ఢిల్లీ చట్టసభలో మన ఎంపీ లకు నేటివరకు ఆశించిన స్థాయిలో పెద్దరికం దక్కలేదు. 18వ సార్వత్రిక ఎన్నికలు జరుగుతుండగా 17సార్వత్రిక ఎన్ని కల నాటికి పలు పార్టీల నుంచి 20 మంది లోకసభ ఎంపీలు గా గెలుపొందినప్పటికీ ఒకేఒక్కరికి కేంద్ర మంత్రి పదవి వరించింది. అయితే మొట్టమొదటి పార్లమెంటు భవనాన్ని ప్రా రంభించిన ఘనత మన ఎంపీకే దక్కడం, అలాగే ఉమ్మడి జిల్లా నుంచే గెలుపొందిన మరో ఎంపీ ఆ పార్టీ జాతీయ కా ర్యదర్శిగా ఎన్నికై సుదీర్ఘ కాలంపాటు కొనసాగడం ద్వారా జిల్లాకు దేశవ్యాప్తంగా గుర్తింపు రావడం కాస్త ఊరడింపు. 1952 నుంచి 2019 వరకు నల్లగొండ, 2009 డీ లిమిటేషన్‌లో రద్దయిన మిర్యాలగూడతోపాటు అదే సంవత్సరం నూతనం గా ఏర్పడిన భువనగిరి పార్లమెంటు నియోజక వర్గాలకు 17 పర్యాయాలు జరిగిన ఎన్నికలలో వివిధ పార్టీల నుంచి 20 మంది లోకసభ ఎంపీలుగా గెలుపొందారు. కాని 1999, 2004లో మిర్యాలగూడ నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గెలు పొందిన సూదిని జైపాల్‌రెడ్డి మాత్రమే కేంద్ర పట్టణాభివృద్ధి, పెట్రోలియం తదితర ముఖ్యశాఖల కేబినెట్ మంత్రిగా వ్యవహరించారు. ఆ సమయంలో ఉమ్మడి జిల్లా అభివృద్ధికి కేంద్ర మంత్రిగా అందించిన సహకారం పలువురి మన్ననలు పొందింది. రాజ్యసభకు బీఆర్ఎస్‌కు చెందిన బడుగుల లింగయ్య యాదవ్‌తో పాటు గతంలో రాజ్యసభ ఎంపీలుగా వ్యవహరిం చిన ఎవరికీ కేంద్రమంత్రి పదవి యోగం దక్కలేదు.

152 రోజులు..
మూడు సార్లు ఓటు

● అసెంబ్లీ.. పార్లమెంట్.. పట్టభద్రుల పోలింగ్‌లో ఓటు వేయనున్న ఓటర్లు



భువనగిరి టౌన్, మే 7: ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన 1,89,089 మంది 152 రోజుల వ్యవధిలో మూడుసార్లు ఓటు వేయనున్నారు. 2023, నవంబరు 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని 12 అసెంబ్లీ స్థానాలకు ఓటువేసిన ఓటర్లే తిరిగి 13 మే 2024న జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి, నల్లగొండ నియోజకవర్గాల్లోనూ మరోమారు ఓటు వేయనున్నారు. అలాగే మే 23న జరగనున్న నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లోనూ ఆ 1,89,089 మంది 152 రోజుల్లో మూడోసారి ఓటు వేయనున్నారు. ఎందుకంటే వారందరూ డిగ్రీ లేదా తత్సమాన కోర్సులు పూర్తి చేసిన మూడేళ్లు పూర్తయిన వెంటనే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరుగా నమోదు కావడమే. అయితే ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటు వేసే అర్హత ఉన్నప్పటికీ పలు కారణాలతో ఓటరుగా నమోదు కాకపోవడంతో స్వల్ప వ్యవధిలోనే మూడోసారి ఓటువేసే అవకాశాన్ని పలువురు కోల్పోయారు. అయితే ఇప్పటికే స్థానిక సంస్థల పదవీ కాలం పూర్తయినందున త్వరలో నిర్వహించే ఎన్నికల్లో 1,89,089 మంది పట్టభద్రుల్లోని గ్రామీణ ఓటర్లు గ్రామపంచాయితీ సభ్యుడు, సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లోనూ ఓటు వేయనున్నారు. మరికొద్దిరోజుల అనంతరం పట్టణ గ్రాడ్యుయేట్ ఓటర్లు మునిసిపల్ ఎన్నికల్లో ఓట్లు వేస్తారు. 1 నవంబర్ 2023 నాటికి డిగ్రీ పూర్తయి మూడేళ్లు గడిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటు నమోదు చేసుకోని అర్హులు ఆ 1,89,089 మంది ఓటర్లతో పోలిస్తే ఓ ఓటు అవకాశాన్ని కోల్పోతున్నారు.

వడదెబ్బతో ఇద్దరి మృతి

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వడదెబ్బతో ఇద్దరు మృతి చెందారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో ఓ వృద్ధురాలు, నల్లగొండ జిల్లాలో మరో వ్యక్తి వడదెబ్బతో మృతి చెందారు.

మోత్కూరు, మే 7: మోత్కూరు మునిసిపాలిటీ కేంద్రానికి చెందిన రావుల మణెమ్మ (95) మంగళవారం మధ్యాహ్నం వడదెబ్బతో మృతి చెందారు. ఆమె కుమారులు, కుమార్తెలు హైదరాబాదులో ఉంటుండగా ఆమె ఇంట్లో ఒంటరిగా ఉంటోంది. ఆమె సోదరి కుమారుడు, కోడలు ఆమె బాగోగులు చూస్తున్నారు. రెండు రోజులుగా ఎండలు మండిపోతుండటంతో ఆమె వడ దెబ్బ తగిలి మంగళవారం మృతి చెందిందని ఆమె సోదరి కుమారుడు సోమయ్య తెలిపారు.

మిర్యాలగూడ అర్బన్: వడదెబ్బకు గురై చికిత్సపొందుతున్న వ్యక్తి మంగళవారం మృతి చెందాడు. స్థానికులు, బంధువుల వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం రాంనగర్ బంధం కాలనీకి చెందిన జిగిడి సత్యం(52)నాయీబ్రాహ్మణ సంఘం పట్టణ కమిటీ సభ్యుడిగా కొనసాగుతున్నాడు. వృత్తిలో భాగంగా ఈ నెల 5న మిర్యాలగూడకు వచ్చి సాయంత్రం ఇంటికి వెళ్లిన తర్వాత వడదెబ్బతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. దీంతో అతన్ని కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్సపొందతూ మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. సత్యం మృతి పట్ల సంఘం నాయకులు తమ ప్రగాఢ సంతాపం వ్యక్తంచేసి, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. సత్యంకు భార్య, ఇద్దరు కుమారులున్నారు. సత్యం కుటుంబాన్ని పరామర్శించిన వారిలో నాయీబ్రాహ్మణసంఘం నాయకులు రాయంచు నర్సింహ, మేడిపల్లి సైదులు, రాచమళ్ల వెంకన్న ఉన్నారు.



జిగిడి సత్యం(ఫైల్)

కురిసిన వడగళ్ల వాన

● జిల్లాలో పలుచోట్ల ఈదురుగాలులు, వడగళ్లతో కూడిన వానలు ● యాదగిరిగుట్టలో కూలిన చలువ పందిళ్లు ● నేలరాలిన మామిడి కాయలు ● తడిసిన ధాన్యం రాశులు


చౌటుప్పల్ మార్కెట్‌లో వడగళ్ల వానకు తడిసిన ధాన్యం రాశులు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వడగళ్ల వాన కురిసింది. ఈదురు గాలులకు తోడు ఉరుములు, మెరుపులతో ఆకాశం మేఘావృతమై, ఒక్కసారి భారీ వర్షం పడింది. నల్లగొండ జిల్లా కనగల్ మండలంలో గంటన్నర వ్యవధిలో 6.7సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. గాలి దుమారానికి అక్కడక్కడ మామిడి చెట్లకు కాయలు నేలరాలాయి. యాదగిరిగుట్ట లక్ష్మీ నృసింహస్వామి క్షేత్రంలో మంగళవారం సాయంత్రం ఈదురు గాలులకు చలువ పందిళ్లు కూలి, ద్విచక్రవాహనాలపై పడ్డాయి.


నల్లగొండ జిల్లాకేంద్రంలో వర్షంలో బైక్‌పై ప్రయాణం

యాదాద్రి, మే 7(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. ఉదయం 10 నిమిషాలు వర్షం కురవగా, సాయంత్రం గంటసేపు వర్షం కురిసింది. ఈదురుగాలులతో కూడి వర్షాలు కురిశాయి. జిల్లాలోని బొమ్మలరామారంలో అత్యధికంగా 4.7సెం.మీల వర్షపాతం నమోదుకాగా, యాదగిరిగుట్టలో అత్యల్పంగా 1.5 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. భువనగిరి, యాదగిరిగుట్ట, ఆలేరు, వలిగొండ, మోటకొండూరు రాజాపేట, చౌటుప్పల్, తుర్కపల్లి మండలాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఆలేరు కొలనుపాక, శారాజీపేట, తదితర గ్రామాల్లో వడగళ్ల వాన పడింది. ఈదురుగాలులతోపాటు వడగళ్ల వానకు మామిడి తోటల్లో కాయలు నేలరాలాయి. తోటల్లో 30శాతం వరకు కాయలు నేలరాలడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాత దశలోకి వచ్చిన మామిడి పంట నేలపాలు కావడంతో రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. పలుచోట్ల కొనుగోలు కేంద్రాల్లో నీరు చేరింది. అయితే రైతులు ధాన్యం తడకుండా టార్పాలిన్లు కప్పారు. రాత్రి వర్షం కురిస్తే ధాన్యం తడిసే ప్రమాదం ఉందని ప్రాంతాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భువనగిరి టౌన్: వేసవి ఉక్కపోతతో సతమతమవుతున్న భువనగిరివాసులకు మంగళవారం సాయంత్రం అకస్మాత్తుగా కురిసిన వర్షం ఉపశమనం కలిగించింది. తెల్లవారుజామునే చిన్నపాటి ముసురు కురిసి వాతావరణం చల్లగా మారింది. కానీ అంతలోనే తిరిగి ఎండ విజృంభించింది. కానీ సాయంత్రానికి వాతావరణం అకస్మాత్తుగా మారి ఉరుములు, మెరుపులు, గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వర్షం నీటితో పలు ప్రాంతాల్లో ఇక్కట్లు నెలకొన్నాయి. చెట్టు కొమ్మలు విరిగి పడగా విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. ఏదేమైనా అకస్మాత్తుగా కురిసిన వర్షంతో ప్రజలు ఉల్లాసానికి గురయ్యారు.

మోత్కూరు: మోత్కూరు, ఆత్మకూరు(ఎం) మండలాల్లో మంగళవారం రాత్రి ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. గాలివానకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులు, తూకం వేసిన బస్తాలు తడిశాయి. ఈదురు గాలులకు తోటల్లో మామిడి, నిమ్మ కాయలు రాలాయి. వరుసగా కురుస్తున్న గాలివానలకు రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు.

వలిగొండ: మండలంలో మంగళవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన అకాల వర్షం కురిసింది. భారీగా వీచిన ఈదురు గాలులకు మామిడి కాయలు నేలరాలినట్లు రైతులు తెలిపారు. ఈదురు గాలులకు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది.

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో మంగళవారం సాయంత్రం ఈదురు గాలులకు చలువ పందిళ్లు కూలిపోయి, ద్విచక్రవాహనాలపై పడ్డాయి. దీంతో భక్తులు భయభ్రాంతులకు గురయ్యారు.

మోటకొండూర్: నెల రోజులుగా ఉక్కపోతలు, వేడి గాలులతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు కాస్త ఉపశమనం కలిగింది. సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఇదురు గాలులతో కూడిన మోస్తారు వర్షం కురిసింది. దీంతో అక్కడక్కడ చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయి. సుమారు మూడు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పాడింది.

రాజాపేట: రాజాపేట మండలంలోని బొందుగుల, రాజాపేట, పుట్టగూడెం, పారుపల్లి, బేగంపేట, రఘునాధపురం తదితర గ్రామాల్లో మంగళవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. కుర్రారం, బొందుగుల, బూరుగుపల్లి, రేణికుంట, సోమారం గ్రామాల్లో మామిడి తోటల్లో మామిడి కాయలు పూర్తిగా రాలిపోయాయి. మండలంలోని ఐకేపీ కేంద్రాల్లో పోసిన ధాన్యం రాశులపై కప్పి టార్పాలిన్లు గాలులకు ఎగిరిపోవడంతో ధాన్యం పూర్తిగా తడిసింది. వారం రోజులుగా ఉక్కపోత, మండుతున్న ఎండలతో ఇబ్బంది పడిన ప్రజలు వర్షం కురువడంతో వాతావరణం చల్లగా మారడంతో ఊపిరి పీల్చుకున్నారు.

ఆలేరు రూరల్: మండలకేంద్రంతోపాటు మండలంలోని కొలనుపాక, శారాజీపేట, కొల్లూరు, గుండ్లగూడెం తదితర ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం అరగంట పాటు కురిసింది. ఎండవేడితో వేడెక్కిన వాతావరణం ఈ వర్షం కారణంగా ఒక్కసారిగా చల్లబడింది. 2, 3 నిమిషాలపాటు వడగండ్లు కురవడంతో అక్కడక్కడ పంట నష్టం జరిగింది. ఐకేపీ కేంద్రాల్లో ఉన్న ధాన్యం కొంతమేర తడిసింది. ఈదురుగాలులకు కొలనుపాకలో చెట్లు, ఆలేరు బీసీకాలనీలో విద్యుత్ స్తంభాలు నేలకూలాయి.

రామన్నపేట: రామన్నపేట మండలకేంద్రంతోపాటు ఇంద్రపాలనగర్, బోగారం, సిరిపురం, వెల్లంకి, దుబ్బాక, పల్లివాడ, జనంపల్లి తదితర గ్రామాల్లో మంగళవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. దీంతో మార్కెట్ యార్డులలో ఉన్న ధాన్యం కొంతమేరకు తడిసింది. మామిడి తోటల్లో మామిడి కాయలు రాలి రూ.లక్షల్లో నష్టం వాటిల్లిందని ఆయా గ్రామాల రైతులు తెలిపారు.

గుండాల: గుండాల మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం వర్షం కురిసింది. దీంతో గుండాల మండల కేంద్రంతోపాటు మండలంలోని సీతారాంపురం, సుద్దాల, మాసాన్‌పల్లి, బ్రాహ్మణపల్లి, వెల్మజాల, మరిపడగ, తుర్కలషాపురం తదితర గ్రామాలలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం రాశులు తడిసిపోయాయి.

చౌటుప్పల్ టౌన్: చౌటుప్పల్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ధాన్యం రాశులు తడిసిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యం అకాల వర్షంతో కొనుగోలు కేంద్రాల్లో తడిసిపోయింది. మార్కెట్ యార్డులో పోసిన 145 మంది రైతులకు చెందిన ధాన్యం రాశుల కిందకు వర్షపు నీరు చేరుకోవడంతో తడిసి ముద్దయ్యాయి. ధాన్యం రాశుల చుట్టూ వర్షపు నీరు నిలిచింది. దీంతో ధాన్యం రాశి మొత్తంగా తడిసిపోయే ప్రమాదం నెలకొంది. అదేవిధంగా తూకాలు వేసిన 2,150 ధాన్య బస్తాలు తడిసిపోయాయి. ఇదిలా ఉండగా, తూకాలు వేసిన ధాన్యం బస్తాలను తరలించడంలో చేస్తున్న జాప్యంతోనే కొనుగోళ్లలో ఆలస్యమవుతోందని, అకాల వర్షానికి జరిగిన నష్టానికి అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని రైతులు మండిపడుతున్నారు.


నల్లగొండ జిల్లాకేంద్రంలో ఉరుములు.. మెరుపులు..

కనగల్‌లో 6.7సెం.మీల వర్షం

నల్లగొండ, మే 7: నల్లగొండ జిల్లాలో పలు చోట్ల మంగళవారం రాత్రి ఓ మోస్తారు నుంచి భారీ వర్షపాతం నమోదు అయింది. కనగల్ మండలంలో అత్యధికంగా భారీ వర్షపాతం నమోదు అయింది. కనగల్ మండలంలో 6.7సెం.మీల వర్షం కురిసింది. జిల్లా కేంద్రమైన నల్లగొండలో రాత్రి 7.15గంటల నుంచి భారీ వర్షం మొదలైంది. ఉరుములు, మెరుపులతో నల్లగొండ పట్టణంలో భారీ వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. శాలిగౌరారం మండలంలో అత్యధికంగా 27.8మి.మీల వర్షం కురిసింది. అత్యల్పంగా చిట్యాలలో 2.6 సెం.మీల చొప్పున వర్షం పడింది. కొన్నిచోట్ల కళ్లాల్లో ధాన్యం తడిసింది. చండూరు మండలంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడింది. నల్లగొండ మండలం అన్నెపర్తి గ్రామంలో ఈదురుగాలులకు నిమ్మచెట్లు నేలకువాలాయి. నాగార్జునసాగర్‌లో ఈదురు గాలులు వీచాయి. దీంతో విద్యుత్ సరఫరాకు ఆటంకం కలిగింది. కొండమల్లేపల్లి మండలంలో ఈదురుగాలులతో కూడిన వర్షం పడటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. జిల్లాలోని చాలా మండలాల్లో ఈదురుగాలులతో చెట్లు నేలకు ఒరగగా విద్యుత్ స్తంభాలు కూడా కూలాయి.

శాలిగౌరారం: శాలిగౌరారంలో మంగళవారం రాత్రి ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. మంగళవారం సాయంత్రం వరకు దంచికొట్టిన ఎండకు ఇళ్లకే పరిమితమై ఉక్కిరి బిక్కిరి అయ్యారు. ఈదురుగాలులకు పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు కూలిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పలు గ్రామాల ప్రజలు అంధకారంలో మగ్గారు. ఇళ్ల రేకులు ఎగిసిపడ్డాయి.


ఈదురుగాలుల వర్షానికి నేలకూలిన వృక్షాలు


భువనగిరిలో కురుస్తున్న వర్షం

సూర్యాపేటలో చల్లబడిన వాతావరణం

సూర్యాపేట, సూర్యాపేట టౌన్ మే 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వాతావరణం చల్లబడింది. పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. సూర్యాపేట జిల్లా కేంద్రంలో రాత్రి 7గంటల సమయంలో ఉరుములతో కూడిన వర్షం కురిసింది. పెన్‌పహాడ్ మండలం జానారెడ్డి నగర్‌లో చెట్లు కూలి రోడ్డుపై అడ్డంగా పడడంతో కొద్ది సేపు రాకపోకలకు అంతరాయం కలిగింది. నడిగూడెం, అనంతగిరి మండలంలోని గాలి దుమారానికి మామిడి కాయలు నేల రాలాయి. హుజూర్‌నగర్‌లో మధ్యాహ్నం వర్షం స్వల్పంగా కురిసింది. కోదాడలో ఉరుములు మెరుపులతో వాతావరణం చల్లబడింది.

నడిగూడెం: మండలంలో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. మండలంలోని రామాపురం, శ్రీరంగాపురం, కరవిరాల, చెన్నాకేశపురం, రత్నవరం తదితర గ్రామాల్లో మామిడి కాయలు రాలిపోయాయి. ఈ ఏడాది అరకొరగా పండిన పంట ఈదురుగాలులకు నేలపాలైంది. పంట నష్టం జరిగిన రైతులను ఆదుకోవాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

మండలం	వర్షపాతం (సెం.మీ)
నల్లగొండ జిల్లాలో..	
కనగల్	6.7
మునుగోడు	4.7
నల్లగొండ	4.2
కట్టంగూరు	4.0
శాలిగౌరారం	3.5
నకిరేకల్	3.3
నాంపల్లి	3.28
గుర్రంపోడు	2.93
చిట్యాల	2.68
చండూరు	2.2
పీఏపీల్లి	2.2
తిప్పర్తి	2.0
యాదాద్రి జిల్లాలో..	
బొమ్మలరామారం	6.3
భువనగిరి	6.1
రామన్నపేట	3.1
చౌటుప్పల్	3.1
బీబీనగర్	2.8
వలిగొండ	2.7
ఆలేరు	2.3
మోటకొండూరు	2.1
పోచంపల్లి	2.1
సూర్యాపేట జిల్లాలో..	
అర్లపల్లి	3.1
నాగారం	22.3
ఆత్మకూరు(ఎస్)	23.3
తిరుమలగిరి	22.3

పెండింగ్ వేతనాలకోసం..

పంచాయతీ కార్యాలయానికి తాళం వేసి నిరసన


గ్రామ పంచాయతీ కార్యాలయానికి తాళం వేసి, నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు

గుండాల, మే 7: ఎనిమిది నెలలుగా తమకు వేతనాలు ఇవ్వడం లేదని, వెంటనే వేతనాలు చెల్లించాలని మండలంలోని తుర్కలషాపురం పంచాయతీ కార్మికులు మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయానికి తాళం వేసి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్మికులు మాట్లాడుతూ తమకు తినడానికి ఇంట్లో సరకులు కూడా లేవని, వేతనాలు ఇవ్వాలని అడిగితే నిధులు లేవంటున్నారని, తప్పని పరిస్థితుల్లో తాము ధర్నా చేయాల్సి వస్తోందని తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా పంచాయతీ అధికారి సునంద దృష్టికి తీసుకు వెళ్లగా వెంటనే ఎంపీవో ధనంజయ్‌కు ఫోన్ చేసి సంఘటనా స్థలానికి పంపించారు. దీంతో ఎంపీవో, గ్రామ ప్రత్యేకాధికారి పరమేష్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్దకు చేరుకుని కార్మికులతో మాట్లాడి, మూడు నెలల వేతనాన్ని చెల్లించారు. మిగగతా ఐదు నెలల వేతనం త్వరలో వచ్చే విధంగా చూస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించి, విధుల్లోకి చేరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు శ్రీనివాస్, యాదయ్య, లింగయ్య, వెంకటేశ్, వెంకటమ్మలు పాల్గొన్నారు.

రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

భువనగిరి రూరల్, మే 7: యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలంలోని పగిడిపల్లి-భువనగిరి రైల్వే స్టేషన్ల మధ్య మంగళవారం రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఎస్.సత్యనారాయణ తెలిపిన వివరాలు ఉన్నాయి. కాజీపేట నుంచి సికింద్రాబాద్ వైపు వెళ్తున్న వందేభారత్ రైలు కింద పడి సుమారు 35 సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడని, మృతుని ఒంటిపైన లైట్ బ్లూ, జీన్స్ ప్యాయింట్, పసుపుపచ్చ బ్లూ చెక్స్ షర్ట్ ఉండడంతో పాటు నడుముకు మొలతాడు, మెడలో నల్లని దారం ఉందని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని మృతదేహాన్ని జిల్లా కేంద్ర ఆసుపత్రిలోకి మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. వివరాల కోసం 8712568454 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలి

భువనగిరి రూరల్, మే 7: ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రభుత్వ ఉద్యోగులు విధిగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవాలని జేఏసీ జిల్లా చైర్మన్ మందడి ఉపేందర్‌రెడ్డి కోరారు. మంగళవారం స్థానిక వెన్నెల కళాశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో పలువురు ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 8 చివరి గడువు కావడంతో ప్రతీ ఒక్క ఉద్యోగి ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఆయన వెంట టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు ధరణికోట భగత్ ఉన్నారు.



ఓటు హక్కును వినియోగించుకున్న ఉద్యోగ సంఘాల ప్రతినిధులు

అక్రమంగా మద్యం తరలిస్తున్న నలుగురి అరెస్టు

● *50కిలోల బెల్లం, 21లీటర్ల సారా, మూడు వాహనాలు స్వాధీనం*

హుజూర్‌నగర్, మే 7: సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని కొత్తదొనబండ తండా, మేళ్లచెర్వు, చింత్రియాల గ్రామాల్లో ఎక్సైజ్ అధికారులు మంగళవారం తనిఖీలు చేసి నలుగురిని అరెస్టు చేశారు. నిందితుల నుంచి 50కిలోల బెల్లం, 21లీటర్ల సారా, మూడు వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ నాగార్జునరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వెల్లటూరుకు చెందిన నరసమ్మ టీవీఎస్ మోపెడ్‌పై ఎనిమిది లీటర్ల సారా తరలిస్తుండగా, సారాను, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కొత్తదొనబండతండాకు చెందిన బానోతు బాలు మోటార్ సైకిల్‌పై ఎనిమిది లీటర్ల సారా తరలిస్తుండగా, సారాను, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. సాధుతండాకు చెందిన ధరావత్ లింగా, ధరావత్ రంగమ్మ మోటర్ సైకిల్‌పై ఐదు లీటర్ల సారా, 50కిలోల బెల్లం తరలిస్తుండగా, సారా, బెల్లం, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులు నలుగురినీ అరెస్టు చేశామన్నారు. వివిధ కేసుల్లో 22మందిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో ఎస్‌ఐలు దివ్య, జగన్మోహన్, వెన్నెల, గోవర్ధన్ పాల్గొన్నారు.

రూ.5వేల విలువైన మద్యం స్వాధీనం

కోదాడ రూరల్, మే 7: సూర్యాపేట జిల్లా కోదాడ మండలం కొమరబండ గ్రామంలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్‌ఐ అనిల్‌రెడ్డి తెలిపారు. నిందితుడి నుంచి రూ.5వేల విలువైన ఆరు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గట్టికల్‌లో అగ్ని ప్రమాదం

ఆత్మకూర్(ఎస్), మే 7: సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలంలోని గట్టికల్ గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తి వరి కొయ్యలకు నిప్పు పెట్టడంతో గాలిదుమారానికి పరిసర ప్రాంతాలు అగ్నికి ఆహుతయ్యాయి. తాటిచెట్లు, వేపచెట్లు, సమనమ్మ కుంటలో ఉన్న తుమ్మచెట్లు అగ్ని ప్రమాదంలో కాలి బుడిదయ్యాయి. రెండు గంటలపాటు చెలరేగిన మంటలకు ప్రజలు ఆందోళనకు గురయ్యారు. అయితే ఈ సమయంలోనే గాలి దుమారం రావడంతో మంటలు ఎక్కువగా వ్యాపించి గ్రామం వైపు రావడంతో గ్రామస్థులు భయాందోళన చెందారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బందితో అగ్నిమాపక యంత్రంలో గ్రామనికి వచ్చి మంటలను ఆర్పారు. మంటలను ఆర్పడం మరో గంట ఆలస్యమైతే తీవ్ర ప్రమాదం జరిగేదని గ్రామస్థులు తెలిపారు. 15 రోజుల్లో గ్రామంలో లింగమంతుల జాతర జరగనుంది. ఆలయ సమీపంలో అగ్ని ప్రమాదం జరగడంతో గ్రామస్థుల్లో ఆందోళన నెలకొంది.


మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

విద్యుదాఘాతంతో రెండు ఎడ్లు మృతి

ఆత్మకూర్(ఎస్), మే 7: సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్)మండంలోని ఏపూర్ గ్రామానికి చెందిన రైతు పరాల లింగయ్యకు చెందిన రెండు ఎడ్లు విద్యుదాఘాతంతో మంగళవారం మృతి చెందాయి. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామ శివారులోనివ్యవసాయ భూమిలో మేత మేస్తూ ఆదివారం గాలివానకు తెగిపడిన విద్యుత్ తీగలు తగిలి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాయి. వీటి విలువ రూ.1.20లక్షలు ఉంటుందని, ప్రభుత్వం తనను ఆర్థికంగా ఆదుకోవాలని రైతు లింగయ్య కోరారు.


విద్యుదాఘాతంతో మృతి చెందిన ఎడ్లు

వస్త్ర దుకాణంలో ఉరి వేసుకొని..

కొండమల్లేపల్లి, మే 7: ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండల కేంద్రంలో మంగళవారం వెలుగుచూసింది. ఎస్‌ఐ రామ్మూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్ రాష్ట్రంలోని బియావ్ జిల్లా పాట్వా గ్రామానికి చెందిన ప్రజాపతి సోహన్‌లాల్, కమ్లి దంపతుల మూడో కుమారుడు రాకేష్(24) రెండు సంవత్సరాలుగా కొండమల్లేపల్లి పట్టణంలోని ఓ రెడిమేడ్ వస్త్ర దుకాణంలో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మూడు నెలల క్రితం హైదరాబాద్‌కు వెళ్లిన రాకేష్ ఈ నెల 6వ తేదీన కొండమల్లేపల్లికి వచ్చాడు. ఈ క్రమంలోనే తన పాత యజమాని అయిన సందే కిరణ్‌కు ఫోన్ చేసి మళ్లీ షాప్‌లో పని చేస్తానని, ఇక్కడే ఉంటానని చెప్పాడు. తాను అందుబాటులో లేనని పక్క షాపులో తాళాలు తీసుకొమ్మని కిరణ్ రాకేష్‌తో చెప్పాడు. మరుసటి రోజు మంగళవారం షాప్ తెరవకపోవడంతో అనుమానం వచ్చిన కిరణ్ షాప్ తెరిచి చూడగా రాకేష్ షాపులో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. రాకేష్ బాబాయి ప్రకాష్ చంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


రాకేష్ (ఫైల్)

చికిత్సపొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి

మిర్యాలగూడ అర్బన్, మే 7: నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని హనుమాన్‌పేట ఫ్లై ఓవర్‌వంతెన వద్ద స్పృహతప్పి పడిపోయిన వ్యక్తిని సోమవారం స్థానికులు గుర్తించి టూటౌన్ పోలీసులకు సమాచారమిచ్చారు. అక్కడకు చేరుకున్న పోలీసులు ఆంబులెన్స్‌లో చికిత్సనిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్సపొందుతూ మంగళవారం మృతిచెందినట్లు సీఐ నాగార్జున తెలిపారు. మృతుడి వయసు సుమారు 45 ఏళ్లు ఉంటుందని, పట్టణంలో సంచరించే యాచకుడిగా భావిస్తున్నట్లు తెలిపారు. మృతుడిని గుర్తించిన వారు సెల్: 8712670150, 81868665497 నెంబర్లకు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.



ఇండియా కూటమిని గెలిపించాలి : జూలకంటి

వేములపల్లి, మే 8: దేశాన్ని, దేశ సంపదను, రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా వేముపల్లి మండలకేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ఇచ్చిన హామీలను అమలు చేయనున్నందున ఆ పార్టీను ఓడించాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. మోదీ ప్రభుత్వం పది సంవత్సరాలు ఏ ఒక్క హామీని అమలు చేయకుండా కార్మిక, రైతు వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చి ధరలను, పన్నులను పెంచి ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను అమ్ముకుంటూ దేశ సందపను లూటీ చేసి బడా కార్పొరేట్ సంస్థలకు దోచి పెట్టిందన్నారు. దేశంలో మతపరమైన విద్వేషాలను రెచ్చగొట్టడంతోపాటు రిజర్వేషన్లను రద్దు చేసే కుట్రలకు పాల్పడుతోందన్నారు. బీజేపీ అధికారంలో లేని ప్రతిపక్ష పార్టీలకు చెందిన ప్రభుత్వాలపై సీబీఐ, ఈడీలను ప్రయోగించి ఇప్పటికే ఇద్దరు ముఖ్యమంత్రులను అరెస్ట్ చేసిందన్నారు. రాష్ట్రంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టుల పేరుతో ప్రజాధనాన్ని లూటీ చేసి ప్రాజెక్టులను ఏర్పాటు చేయగా అవి నేడు కుంగి కూలిపోయే ప్రమాదంలో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పాదూరి గోవర్ధని, రైతు సంఘం జిల్లా నాయకులు పాల్వాయి రాంరెడ్డి, మండల కార్యదర్శి పాదూరి శశిధర్‌రెడ్డి, ఎంపీటీసీ, చల్లబొట్ల చైతన్య, రొండి శ్రీనివాస్, పుట్టల సైదులు, వడ్డెగాని సైదులు, ప్రణీత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

కాంగ్రెస్‌కే స్థానిక సంస్థల మాజీ ప్రజాప్రతినిధుల మద్దతు



సమావేశంలో మాట్లాడుతున్న మేడి శంకర్

నల్లగొండ, మే 7: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకే స్థానిక సంస్థల మాజీ ప్రజాప్రతినిధులు మద్దతు తెలుపుతున్నట్లు తెలంగాణ మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, కౌన్సిలర్ల ఐక్యవేదిక నిర్ణయం తీసుకుందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేడి శంకర్ తెలిపారు. జిల్లాకేంద్రంలో మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. మాజీ ప్రజాప్రతినిధులు ఆర్థిక సమస్యలు, అనారోగ్యంతో బాధపడు తుండటాన్ని దృష్టిలో ఉంచుకుని అప్పటి కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావుఠాకూర్, పీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డిని అసెంబ్లీ ఎన్నికల ముందు కలిసినట్లు తెలిపారు. మాజీ ప్రజాప్రతినిధుల సమస్యలను కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పెట్టారని గుర్తుచేశారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌లు ఆకావరం మోహన్‌రావు, భట్టే శంకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కాకునూరి మల్లికార్జున్‌గౌడ్, బీరెల్లి రామచంద్రయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు వండ్ల సాయిబాబా, దంతాపల్లి రవి, ప్రచార కార్యదర్శి గడల రాజు, అవుట రవీందర్, దశరథరెడ్డి, యాదయ్య పాల్గొన్నారు.

బస్సు సర్వీసును సద్వినియోగం చేసుకోవాలి

శాలిగౌరారం, మే 7: నకిరేకల్ నుంచి శాలిగౌరారం మండలకేంద్రం భైరవనిబండ మీదుగా అమ్మనబోల్ వరకు నడిచే బస్సు సర్వీసును సద్వినియోగం చేసుకోవాలని నల్లగొండ డీఎం రాంమోహన్‌రెడ్డి కోరారు. నల్లగొండ డిపోకు చెందిన బస్సు ఉదయం 9.15, మధ్యాహ్నం 12.30కి నకిరేకల్ నుంచి బయలు దేరి శాలిగౌరారం, భైరవునిబండ మీదుగా అమ్మనబోల్‌కు చేరుకుంటుందని తెలిపారు. తిరిగి అమ్మనబోల్‌లో ఉదయం 10.30కి మధ్యాహ్నం 2.00గంటలకు బయలుదేరి భైరవునిబండ, శాలిగౌరారం మీదుగా నకిరేకల్ చేరుకుంటుందన్నారు.

వామపక్షాల పోరాట ఫలితం ఉపాధి చట్టం

కట్టంగూరు, మే 7: భువనగిరి సీపీఎం ఎంపీ అభ్యర్థి ఎండీ. జహంగీర్‌ను గెలిపించాలని ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు జి. నాగయ్య కోరారు. మండలంలోని పిట్టంపల్లి చెరువులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలతో మంగళవారం మాట్లాడారు. ఉపాధి హామీ పథకాన్ని విచ్ఛిన్నం చేస్తున్న బీజేపీని ఓడించాలని కోరారు. వామపక్ష పోరాటాల ఫలితంగా ఏర్పడిన ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించి బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు చిన్నపాల లక్ష్మీనారాయణ, గంజి మురళీధర్, దండెంపల్లి సత్తయ్య, పెంజర్ల సైదులు, జాల రమేష్, కట్ట బక్కయ్య తదితరులు ఉన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి



సర్టిఫికెట్ అందజేస్తున్న నిర్వాహకులు

దేవరకొండ, మే 7: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని సీనియర్ న్యాయవాది నెమికంటి గౌరిశంకర్ అన్నారు. దేవరకొండ మునగాల కొండల్‌రావు డిగ్రీ కళాశాలలో కామర్స్ విభాగంలో ప్రతిభ కనబర్చి 40 గంటలపాటు శిక్షణ తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులకు మంగళవారం సర్టిఫికెట్లు అందజేశారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ విభాగం ఆధ్వర్యంలో సర్టిఫికెట్ కోర్స్ ఇన్ ఇఫైలింగ్ ఆఫ్ ఇన్‌కం ట్యాక్స్ రిటర్న్స్ అనే కార్యక్రమం ఫిబ్రవరి 8 నుంచి మే 7వరకు విద్యార్థులకు శిక్షణ ఇచ్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవి తెలిపారు. ఈ కార్యక్రమంలో కామర్స్ లెక్చరర్స్ పద్మజ, చందూరు డిగ్రీ కళాశాల అధ్యాపకులు శారదదేవి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు పలువురి రాజీనామా

వేములపల్లి, మే 7: మండలంలోని పలు గ్రామాల నాయకులు బీఆర్ఎస్‌కు మంగళవారం రాజీనామా చేశారు. మండల కేంద్రంలో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ఏర్పాటుకు క్రియాశీలకంగా వ్యవహరించిన మాజీమంత్రి కుందూరు జానారెడ్డి కుమారుడు రఘువీర్‌రెడ్డి విజయం కోసం కృషి చేయనున్నట్లు తెలిపారు. మిర్యాలగూడ నియోజకవర్గ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి నాయకత్వంలో పార్టీ బలోపేతానికి కృషిచేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తమను ఆహ్వానిస్తే పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటామని తెలిపారు. బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన వారిలో జడ్పీటీసీ ఇరుగు మంగమ్మవెంకటయ్య, రైతుసంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు నామిరెడ్డి యాదగిరిరెడ్డి, మాజీ జడ్పీటీసీ ఇరుగుదిండ్ల పద్మగోవింద్, మాజీ సర్పంచులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, అంకెపాక రాజు, పీఏసీఎస్ డైరెక్టర్లు గొట్టె సైదులు, బంటు నాగమ్మసైదులు, కోడిరెక్క శంభులింగం, చింతకాయల వీరేందర్, నిడుగొండ రామచంద్రు, వంగూరి వెంకటయ్య, ఇరుగుదిండ్ల రాజు తదితరులు ఉన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్‌ను మాదిగలు నమ్మే పరిస్థితిలో లేరు



సమావేశంలో మాట్లాడుతున్న టీఎమ్మార్పీఎస్ నాయకులు

నల్లగొండ టౌన్, మే 7: రాష్ట్రంలోని మాదిగలు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను నమ్మే పరిస్థితిలో లేరని ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చింతాబాబుమాదిగ, కోర్ కమిటీ సభ్యులు కత్తుల తులసిదాస్ మాదిగ, జిల్లా అధ్యక్షుడు రామంజి సైదులుమాదిగ అన్నారు. జిల్లాకేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వంద రోజుల్ల ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత కల్పిస్తామని గతంలో బీజేపీ మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చి మాదిగలు మోసం చేసిందన్నారు. బీజేపీ దళితుల వ్యతిరేక పార్టీ అని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో సంఘం రాష్ట్ర అద్యక్షుడు మేడి పాపయ్య మాదిగ నాయకత్వంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తున్నామన్నారు. నల్లగొండ అభ్యర్థి కుందూరు రఘువీర్ విజయానికి కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి నరసింహ, రాష్ట్ర కార్యదర్శి పుల్లెంల యాదయ్య, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు పల్లెటి లక్ష్మణ్ మాదిగ, రాష్ట్ర ప్రచార కార్యదర్శి కుడుతాల నాగయ్య, నాయకులు తలకొప్పుల గిరి, అధికార ప్రతినిధి ఎర్రోళ్ల శ్రీనివాస్, మంద వెంకన్న, కనుక జానయ్య మాదిగ, ఇంద్రపల్లి శ్రీనివాస్, యాదయ్య, మేడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి



డిండిలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్



తిప్పర్తి మండలంలో ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు



హాలియాలో ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్, వామపక్ష నాయకులు

డిండి, మే 7: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిచేసి రైతులకు సాగు, తాగునీరు అందిస్తుందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. కాంగ్రెస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని గెలిపించాలని మండలంలోని ఎర్రగుంటపల్లిలో శనివారం ప్రచారం చేశారు. డిండి ఎత్తిపోతలకు ఎక్కడి నుంచి నీళ్లు తీసుకోవాలో గత ప్రభుత్వం పదేళ్లలో కూడా తేల్చలేకపోయిందన్నారు. రాష్ట్రంలో చేపట్టిన ప్రాజెక్టులను కేసీఆర్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. శాసనసభ ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తుందని చెప్పారు. ఆగస్టు 15వరకు రైతుల రుణమాఫీ చేసి చూపిస్తామని అన్నారు. సీపీఐ, సీపీఎం బలపర్చిన అభ్యర్థి రఘువీర్‌రెడ్డిని గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వెంకటేశ్వరరావు, నాయకులు రాజేష్‌రెడ్డి, పల్లా నర్సింహారెడ్డి, టి.నాగార్జునరెడ్డి, మల్‌రెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, గుర్రం రాములు, బుచ్చిరెడ్డి, జంగారెడ్డి, గోలి శ్రీనివాసరెడ్డి, శ్రీరామదాసు కనకచారి, దామోదర్‌రావు, శేఖర్‌రెడ్డి, లక్‌పతినాయక్, హనుమంతురెడ్డి, బొల్లి శైలేజ్ పాల్గొన్నారు.

దేవరకొండ: మండలంలోని మైనంపల్లి ఎంపీటీసీ కొర్ర గౌతమిరాంసింగ్ ఉపాధి కూలీలను కలిసి కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి రఘువీర్‌రెడ్డికి ఓటు వేయాలని ప్రచారం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ఆరు గ్యారంటీల వివరాలను కూలీలకు వివరించి ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరినట్లు రాంసింగ్ తెలిపారు.

మాడ్గులపల్లి: పేదల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యమని టీపీసీసీ జనరల్ సెక్రటరీ కొండేటి మల్లయ్య అన్నారు. మండలంలోని కన్నెకల్, ధర్మాపురం, మాచనపల్లి, గోపాలపురం గ్రామాల్లో కుందూరు రఘువీర్‌రెడ్డిని గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కొత్త దశరథ, చింతరెడ్డి సైదిరెడ్డి, ఎర్రబోలు ఎంకరెడ్డి, చింతరెడ్డి భాస్కర్‌రెడ్డి, కొండేటి శంకర్, వెంకటేశ్వర్లు, చెన్నయ్య, సతీష్, చలమంద గోపాల్ పాల్గొన్నారు.

అడవిదేవులపల్లి: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి విజయానికి కృషిచేయాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొదిల శ్రీనివాస్ అన్నారు. మండలకేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

నల్లగొండ: కాంగ్రెస్‌తోనే మైనార్టీల అభివృద్ధి జరుగుతుందని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ అమీనోద్దీన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే మైనార్టీలకు రక్షణ ఉంటుందన్నారు. పదేళ్ల బీజేపీ పాలనలో మైనార్టీలకు రక్షణ లేకుండా పోయిందని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ ప్రధాని కావడం కాయమన్నారు.

వేములపల్లి: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి విజయం కోసం మండలకేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీపీసీసీ సభ్యుడు చిరుమర్రి కృష్ణయ్య మాట్లాడుతూ దేశ యువతను ప్రజలను మోసం చేసిన బీజేపీని గద్దె దించి కాంగ్రెస్‌ను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మాలి కాంతారెడ్డి, రావు ఎల్లారెడ్డి, మాజీ సర్పంచ్ రేగట్టె రవీందర్‌రెడ్డి, పుట్టల శ్రీనివాస్, పుట్టల కృపయ్య, జిల్లా యాదగిరి, పుట్టల పెదవెంకన్న, కొమ్ము వెంకన్న, హజీ, బొంగర్ల వినోద్, బొంగర్ల గిరి, గురవయ్య, నాగేశ్వర్‌రావు, సుందర్, రాము, నవీద్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

హాలియా: కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అవుతా సైదులు అన్నారు. రఘువీర్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ హాలియాలోని 11, 12వ వార్డులో మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పదేళ్ల బీజేపీ పాలనలో దేశ అప్పు రెండింతలు పెరిగిపోయిందన్నారు. నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందని, సంవత్సరానికి రెండు కట్ల ఉద్యోగాలు కల్పిస్తానన్న మోదీ అనేక పరిశ్రమల మూతకు కారణమయ్యారన్నారు. 6వ వార్డులో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గౌని రాజారమేష్‌యాదవ్ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ చింతల చంద్రారెడ్డి, కాంగ్రెస్, సీపీఎం నాయకులు కత్తి శ్రీనివాస్‌రెడ్డి, ఎస్.కె. బషీర్, శ్రీహరి, చెరుపల్లి ముత్యాలు, చల్లా మట్టారెడ్డి, గోపిశెట్టి సైదులు, ఎడ్ల సోమయ్య, నాగిరెడ్డి, రఫీ, వెంకటేశ్వర్లు, మాల కొండయ్య, కారంపూడి ధనమ్మ, పొదిల వెంకన్న, రమేష్, నరేందర్, వసంతకుమార్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ: ప్రజాస్వామిక దేశానికి కాంగ్రెస్ పార్టీయే దిక్సూచి అని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో రాజీవ్‌భవన్‌లో రాష్ట్ర కిసాన్‌సెల్ ఉపాధ్యక్షుడు, నల్లగొండ పార్లమెంట్ ఇన్‌చార్జి దాసరి డానియేల్‌తో కలిసి ఎన్నికల ప్రచార సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలనుకునే మతతత్వ పార్టీని గద్దెదించాలన్నారు. రాష్ట్రంలో ఆరు గ్యారెంటీలు, దేశంలో పాంచ్ న్యాయ్ అమలుకు కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థులను తిరుగులేని మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్‌సెల్ అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి, నాయకులు చిరుమర్తి కృష్ణయ్య, నూకల వేణుగోపాల్‌రెడ్డి, చిలుకూరి బాలు, పగిడి రామలింగయ్య దేశిడి శేఖర్‌రెడ్డి, రవినాయక్, చెల్లా వెంకన్న, జావీద్, పోలగాని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దామరచర్ల: మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మండలకేంద్రంలోని ఓ హోటల్‌లో దోసెలు వేసి ఓట్లు అభ్యర్థించారు. ఆయన వెంట డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, కిరణ్, వెంకన్నయాదవ్ పాల్గొన్నారు.

తిప్పర్తి: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని జడ్పీటీసీ పాశం రాంరెడ్డి కోరారు. మండలంలోని సిలార్‌మియాగూడెం, సర్వారం గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఉపాధి హామీ కూలీలను ఓటు అభ్యర్థించారు. రెండు గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో ఆయన వెంట డీసీసీ ఉపాధ్యక్షుడు చింతకుంట్ల రవీందర్‌రెడ్డి, నల్లగొండ మార్కెట్ చైర్మన్ జూకూరి రమేష్, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు రొట్టెల రమేష్, జాకటి మోష, నాయకులు కిన్నెర అంజి, లొడంగి వెంకన్న, కట్ట సూర్యప్రకాశ్‌రెడ్డి, ఉయ్యాల నాగరాజు, చింతకుంట్ల సుదర్శన్‌రెడ్డి, బద్దం సైదులు తదితరులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి : కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎంపిపి దూదిపాల రేఖారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటి పథకాలతో పాటు ఆగస్టు 15లోగా రూ.2లక్షల రుణమాఫి కూడా అమలు చేస్తుందని అన్నారు. కాంగ్రెస్‌తోనే సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యుడు ఉట్కూరి వేమన్‌రెడ్డి, పస్నూరి యుగేందర్‌రెడ్డి, అందుగుల ముత్యాలు, ఎంఎక్రైసర్‌ఖాన్, నాయిని ప్రభాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, గంధం సురేష్, బూడిద వెంకటేష్‌యాదవ్,బొడిగె శంకర్‌గౌడ్, పెద్దిశెట్టి సుధాకర్, బూడిద మల్లేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అడవిదేవులపల్లి : మండలంలోని బాలెంపల్లి గ్రామంలో కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో రమావత్ మోతిలాల్‌నాయక్, ముడవత్ సిపాయి, రమావత్ హేమానాయక్, హనుమనానాయక్, రమావత్ నాగునాయక్, సక్రు, శంకర్ పాల్గొన్నారు.

కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం



గట్టుప్పలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

గట్టుప్పల్, మే 7: కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలో మంగళవారం జరిగిన భువనగిరి పార్లమెంట్ ఎన్నికల పార్టీ కమిటీల ఇన్‌చార్జిలు, బూత్ కమిటీ సభ్యుల సమావేశంలో మాట్లాడుతూ భువనగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. బీజేపీ, బీఆర్ఎస్ రెండు ఒకటేనని రాష్ట్రంలో ఉన్న ప్రజలను అన్ని రకాలుగా దోచుకున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలో వస్తేనే పేద వర్గాల ప్రజల అభ్యున్నతి జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పున్న కైలాస్‌నేత, నాయకులు నామ జగన్నాథం, చిరుపల్లి సత్యనారాయణ, రావుల రమేష్, ఆంజనేయులు, రాములు, శ్రీరాములు పాల్గొన్నారు.

మర్రిగూడ: ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షి తులై వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. చేరుతున్నారన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ నుంచి కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో మంగళవారం క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే బడుగు, బలహీన వర్గాలు అభివృద్ధి చెందుతారన్నారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో అజలాపురం మాజీ సర్పంచ్ లాలునాయక్, వార్డు మెంబర్లు, అదేవిధంగా బీఆర్ఎస్ నుంచి 50మంది కార్యకర్తలు చేరారు. ఈ కార్యక్రమంలో ముద్దం శ్రీనివాస్, రాందాసు శ్రీనివాస్, అజలాపురం మాజీ సర్పంచ్ డి.అంజయ్య, మాజీ జడ్పీటీసీ మేతరి యాదయ్య, ఉప్పునూతల మల్లేష్, జంగయ్య, వెంకటయ్య, అజిత్‌రెడ్డి, అనిల్‌రెడ్డి ఉన్నారు.

హాలియా: హాలియా మునిసిపల్ ఛైర్మన్ యడవల్లి అనుపమ నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో అలీనగర్‌కు చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ అజంద్‌ఖాన్, అక్బర్ ఖాన్, జావిద్‌ఖాన్, ఇమ్రాన్‌ఖాన్, ఇమ్రాన్‌ఖాన్, అక్రమ్‌ఖాన్, జియాకాన్, హర్షఖాన్, మక్బూద్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ ఏలో చేర్చాలి

దేవరకొండ, మే 7: ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏలోకి మార్చాలని ముదిరాజు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు బుడిగ వెంకటయ్య, పట్టణ అధ్యక్షుడు రాసమల్ల నారయ్య డిమాండ్ చేశారు. మంగళవారం దేవరకొండ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బాలునాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ముదిరాజుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యేను కలిసివారిలో ముదిరాజ్‌సంఘం నాయకులు లింగయ్య, శ్రీను, రెడ్డిశంకర్, మధు, నీల వెంకటయ్య తదితరులు ఉన్నారు.

కొండమల్లేపల్లిలో పోలీసుల కవాతు

కొండమల్లేపల్లి, మే 7: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం కొండమల్లేపల్లి మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో స్పెషల్ ఫోర్స్ కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ధనుంజయ్యగౌడ్, ఎస్ఐ రామ్మూర్తి మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు పోలీసు కవాతు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా సాగేందుకు ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు.

ఉపాధి కూలీలకు కాంగ్రెస్ అండ: ఎమ్మెల్యే వీరేశం



కట్టంగూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీరేశం, శాలిగౌరారంలో ప్రచారం

కట్టంగూరు, మే 7: ఉపాధి కూలీలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండలంలోని పెద్దచెరువు, అయిటిపాముల చెరువు వద్ద పని చేస్తున్న ఉపాధి కూలీలను మంగళవారం ఓట్లు అభ్యర్థించారు. దేశంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఉపాధి పని దినాలను 100 రోజుల నుంచి 130రోజులు పెంచే విధంగా చట్టం తీసుకొస్తామన్నారు. ఉపాధి కూలీల రోజువారీ వేతనం రూ.400 పెంచే విధంగా కృషి చేస్తామన్నారు. ఉపాధి కూలీలకు రూ.25లక్షల ఇన్సూరెన్స్ ఉండేలా కాంగ్రెస్ పార్టీ చట్టం తీసుకొస్తుందన్నారు. భువనగిరి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పెద్ది సుక్కయ్య మాద యాదగిరి, సుంకరబోయిన నర్సింహ, రెడ్డిపల్లి సాగర్, చెరుకు యాదగిరి, కొమ్మరబోయిన సైదులు, బుచ్చాల వెంకన్న, ముక్కమాల శేఖర్, గుండు పరమేష్, మిట్టపల్లి శివశంకర్, రాజు ఉన్నారు.

శాలిగౌరారం: భువనగిరి కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మండలంలోని తిరుమలరాయినిగూడెంలో మార్కెట్ మాజీ చైర్మన్ చాడ సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గౌర వీరయ్య, నాయకులు పడాల సైదులు, పెంబళ్ల నర్సింహ, నేముల బీరప్ప, పెంబళ్ల భిక్షం, చింతకాయల సోములు, పడాల వెంకన్న, సైదులు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మునుగోడు రూరల్: సీపీఐ బలపర్చిన కాంగ్రెస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మండలంలోని ఎలగలగూడెం గ్రామంలో సీపీఐ, కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు సురిగి చలపతి, ఈదులకంటి కైలాస్, మేకల ప్రమోద్‌రెడ్డి, బక్క నరసింహ, తీర్పారి ఆంజనేయులు, రామచంద్రం, గోపగాని ఉదయ్ పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేసిన ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి



మిర్యాలగూడ మండలం ఉట్లపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మిర్యాలగూడ రూరల్, మే 7: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని రైతు బంధు సమితి మాజీ జిల్లా అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని గెలిపించాలని కోరుతూ మండలంలోని ఉట్లపల్లిలో మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు జొన్నలగడ్డ రంగారెడ్డి, మట్టపల్లి సైదులుయాదవ్, ఒగ్గు జానయ్య, కంపసాటి శ్రీనివాస్, కొనకంచి చంద్రశేఖర్‌రావు, కలమ్మవెంకన్న పాల్గొన్నారు.

చందంపేట: మండలంలోని అచ్చంపేటపట్టి, ముదుదండ్ల, పోల్యానాయక్ తండా, మురుపునూతల గ్రామాలలో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షులు లోక్యానాయక్, మాజీ జడ్పీటీసీ బోయపల్లి శ్రీనివాస్‌గౌడ్, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

అడవిదేవులపల్లి: బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి గెలుపు కోసం బీఆర్ఎస్ నాయకులు అడవిదేవులపల్లి, బంగారికుంటతండాలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కుర్ర శ్రీనునాయక్, రవి, బాలాజీ, శ్రీను, సేవా, లింగా, చిన్ననాయక్, సతీష్, చంటి, గణేష్, రామ, రంగా ఉన్నారు.

కట్టంగూరు: పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు గుణపాఠం చెప్పాలని భువనగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్‌యాదవ్ అన్నారు. కట్టంగూరులో మంగళవారం రాత్రి నిర్వహించిన ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యతో కలిసి మాట్లాడారు. ఆచరణ సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తరాల బలరాం, ఎంపీటీసీలు ఎడ్ల పురుషోత్తంరెడ్డి, బీరెల్లి రాజ్యలక్ష్మీప్రసాద్, మల్లెబోయిన శ్రీలతకృష్ణ, దాసరి సంజయ్, సైదులు పాల్గొన్నారు.

చండూరు రూరల్: బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్‌ను గెలిపించాలని బీఆర్ఎస్ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు గుర్రం వెకంట్‌రెడ్డి అన్నారు. చామలపల్లి, తుమ్మలపల్లి గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బొమ్మరబోయిన వెంకన్న, కురుపాటి సుదర్శన్, పెండోట వెంకటయ్య, మేక కరుణాకర్‌రెడ్డి, కాటం దేవేందర్ పాల్గొన్నారు.

సారా విక్రయిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ఎక్సైజ్ అధికారులు

దేవరకొండ, మే 7: సారా విక్రయిస్తే కేసులు నమోదుచేసి కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ సంతోష్ అన్నారు. దేవరకొండ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని దేవరకొండ, చందంపేట, డిండి మండలాల్లోని పొగిళ్ల, పద్మట్‌పల్లి, పాత్లావత్‌తండా, మేగ్యతండా, కందుకూరు గ్రామాల్లో జిల్లా టాస్క్‌ఫోర్స్ దేవరకొండ స్పెషల్‌పార్టీ పోలీసులతో కలిసి మంగళవారం దాడులు నిర్వహించారు. ఏడు కేసులు నమోదు చేసి సారా విక్రయిస్తున్న ఐదుగురిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి 46 లీటర్ల సారా, 1,100 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు తెలిపారు. దాడుల్లో అసిస్టెంట్ సూపరింటెండెంట్ కృష్ణ, దేవర కొండ ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్, ఎక్సైజ్ అధికారులు సైదులు, నర్సింహ పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగ సంఘం భవనానికి విరాళం

దేవరకొండ, మే 7: దేవరకొండ రిటైర్డ్ ఉద్యోగ సంఘం భవన నిర్మాణానికి రిటైర్డ్ ఉద్యోగ సంఘం సభ్యురాలు జయప్రభ రూ.10116 అందజేసినట్లు ఆ సంఘం నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు తాడిశెట్టి నర్సింహ, అంకం చంద్రమౌళి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగసంఘం భవనానికి దాతలు సహాయ, సహకారాలు అందించడం అభినందనీయమని తెలిపారు.

నీటి విడుదలకు సహకరించిన మంత్రి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

చందంపేట, మే 7: చందంపేట మండలంలోని కరువు నివారణ చర్యలలో భాగంగా డిండి ప్రాజెక్టు నుంచి చందంపేట మండలంలోని చెరువులను, కుంటలను నింపడానికి నీటి విడుదలకు ఆదేశాలుజారీ చేసిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే బాలునాయక్‌కు కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు లోకసాని మన్మధరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం చందంపేట మండల కేంద్రంలోని తీగలచెరువు, మురుపునూతలలోని కుంటలకు నీటి విడుదల సందర్భంగా ఆమె మాట్లాడుతూ కరువు పరిస్థితులు నెలకొన్న చందంపేట మండలానికి నీటి విడుదలకు సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో వైస్ చైర్మన్ వీరారెడ్డి, సత్తిరెడ్డి, నారాయణరెడ్డి, నక్క నర్సింహ, గోపికృష్ణ, ఎలిజర్ల వెంకులు తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణులు ఐక్యంగా ఉండాలి

మిర్యాలగూడ టౌన్, మే 7: సమస్యల పరిష్కారానికి విశ్వబ్రాహ్మణులంతా ఐక్యంగా ఉండాలని సంఘ నాయకులు అన్నభీమోజు నాగార్జునాచారి అన్నారు. సంఘం వ్యవస్థాపకుడు అన్నభీమోజు ఆచారి జయంతి సందర్భంగా పేదలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునికీకరణలో భాగంగా యంత్రాలు అందుబాటులోకి రావడంతో కార్పెంటర్లకు ఉపాధా లేకుండా పోయిందని, ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మల్లిఖార్జునాచారి, రామాచారి, గోవర్ధన్, దుర్గా, లక్ష్మణ్, చారి తదితరులు పాల్గొన్నారు.

సేవలు అందించడం అభినందనీయం

మిర్యాలగూడ టౌన్, మే 7: వాసవీ, వనిత క్లబ్ సభ్యులు కాలనుగుణంగా సేవలందించాలని క్లబ్ డిస్ట్రిక్ట్ ఇంచార్జి పీఆర్వో రాయపూడి భవానీ అన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండులో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానవ సేవే మాదవ సేవని, ఆపన్నహస్తం అందించడంలో ఎల్లవేళలా ముందుండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తల్లం పుష్ప, గుండా లక్ష్మీ, జయిని పద్మావతి, వీ. శ్రీదేవి, కన్నెగుండ్ల భాగ్య, గంధం లీలారాణి, పద్మవతి తదితరులు పాల్గొన్నారు.



నామినేషన్ దాఖలు చేస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్‌రెడ్డి



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, మాట్లాడుతున్న మాజీమంత్రి జగదీష్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి

పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఆర్ఎస్ అభ్యర్థిగా రాకేష్‌రెడ్డి మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ కార్యకర్తలు జిల్లాకేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.